క్లుప్తంగా

నేడు దీపోత్సవం



సిద్ధంగా ఉన్న మట్టి శివలింగాలు

పాడేరురూరల్(అరకులోయ రూరల్): పాడేరు కేంద్రంలో కొలువై ఉన్న ఉమా నీలకంఠేశ్వర స్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం దీపోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మైచర్ల సన్యాసిరావు, సుమ కుమారి దంపతులు తెలిపారు. ఇందులో భాగంగా 108 శివలింగాలకు దీపోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావాలని వారు కోరారు.

ఘనంగా వన సమారాధన



పొల్లూరులో వనసమారాధనలో పాల్గొన్న గ్రామస్తులు

మోతుగూడెం: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పొల్లూరులోని దుర్గా మల్లేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామస్తులకు వనసమారాధన నిర్వహించారు. సుమారు 200 మంది గ్రామస్తులకు పాల్గొన్నారు. వన భోజనలతో పాటు పిల్లలకు వివిధ ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఏపీ జెన్‌కో సీఈ జి.ఎం.వాసుదేవరావు, ఎస్ఏవో ప్రసాద్, ఈఈ వరప్రసాద్, డీఈ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



బురద మార్గంలో పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

గూడెంకొత్తవీధి: వర్షాల కారణంగా మండలంలోని మంగళపాలెం వద్ద దేవరాపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు శనివారం పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లోని రహదారులు బురదమయంగా మారుతున్నాయి. దీంతో వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. వాహనచోదకులు జారిపడుతున్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అప్పలనర్స

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాచ్చిపెంట అప్పలనర్స అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పాఠశాల, వసతి గృహాల్లో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రోజు రోజుకు విద్యార్థులు మరణాలు పెరుగుతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. పూర్తిస్థాయిలో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల్లో మరింత ఆందోళనలు నెలకొన్నట్టు చెప్పారు. ఇప్పటికే ఈ ఏడాదిలో పాఠశాలలు, వసతిగృహాల్లో ఉన్న 10 మందికి పైగా విద్యార్థులు మృతి చెందారని, అయినా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదన్నారు. వసతిగృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం సక్రమంగా పౌష్టికాహారం అందించడం లేదని, ఫలితంగా విద్యార్థులు రక్తహీనత తదితర సమస్యలతో బాధపడుతున్నారన్నారు. అరకులోయ మండలం యండపల్లివలస గురుకుల పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థిని జన్ని ప్రియాంక పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే మృతి చెందినట్టు చెప్పారు. విద్యార్థిని ప్రియాంక మృతికి కారణమైన వారినిక తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి సుందర్‌రావు, నాయకులు లక్కు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో తారురోడ్డు
- తీరిన వెతలు
- బొర్లాడ గ్రామస్తుల హర్షం



బొర్లాడ గ్రామానికి నిర్మించిన రహదారిని పరిశీలిస్తున్న స్థానికులు



గ్రామానికి వెళ్లే రహదారి

పెదబయలు: మండలంలోని రూడకోట పంచాయతీ బొర్లాడ గ్రామానికి తారురోడ్డు నిర్మాణం జరిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.75 లక్షలతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. దశాబ్దాలుగా గ్రామానికి రహదారి లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రవాణా సౌకర్యం లేక కాలినడకనే రాకపోకలు జరిగేవి. రేషన్ సరకులు తీసుకొచ్చేందుకు సమీప గ్రామానికి కాలినడకన వెళ్లి సరకులు మోసుకొచ్చేవారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామానికి రహదారి నిర్మించలేదు. ఈ నేపథ్యంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మన్య ప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారు. దీంతో మన్యంలో చాలా ప్రాంతాలకు రహదారి సౌకర్యం కలిగింది. పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో దశాబ్దాల తరబడి కనీస సౌకర్యాలకు నోచుకోని చాలా ప్రాంతాల్లో అభివృద్ధి దర్శనమిచ్చింది... ఇదిలా ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రారంభమైన పనులు ఎన్నికల కోడ్ వల్ల జాప్యం జరిగింది. ప్రస్తుతం అరకులోయలోని పలు చోట్ల ప్రస్తుత ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చొరవతో రహదారి పనులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా బొర్లాడ గ్రామానికి తారురోడ్డు పనులు వారం క్రితం మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో రూడకోట పోలీసు ఔట్ పోస్టు మీదుగా గెడ్డ ప్రాంతం నుంచి గ్రామానికి తారురోడ్డు నిర్మాణం జరిగింది. బొర్లాడ గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. ఎంతో కాలంగా రోడ్డు కోసం ఎదురు చూసిన ప్రజలకు తారురోడ్డు నిర్మాణం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో పనిచేసిన కలెక్టర్ అమిత్‌కుమార్ నిధులు మంజూరు చేశారని రూడకోట పంచాయతీ అభివృద్ధికి కృషి చేశారని పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ఆనందంగా ఉంది



బొర్లాడ గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి అధికారులకు వినతులు ఇచ్చి వేడుకున్నాం. కాని రోడ్డు మంజూరు కాలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి రోడ్డు మంజూరు అయింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ కాతారి సురేష్‌కుమార్, ప్రత్యేక చొరవతో గ్రామానికి తారురోడ్డు మంజూరైంది. పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు.దశాబ్దాల తరువాత గ్రామానికి తారురోడ్డు నిర్మాణం కావడం ఆనందంగా ఉంది.

– సాగేని రామ్మూర్తి,
రైతు, బొర్లాడ గ్రామం, రూడకోట పంచాయతీ

అన్ని గ్రామాలకు రహదారులు



రూడకోట పంచాయతీలో అన్ని గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని లక్ష్యంగా పనిచేస్తున్నాం. బొర్లాడ గ్రామానికి గతంలో మట్టి రోడ్డు ఉండేది. మొదట మెటల్ రోడ్డు నిర్మాణం చేసి ప్రస్తుతం తారు రోడ్డు నిర్మాణం జరిగింది. పంచాయతీలో అన్ని గ్రామాలకు రోడ్డు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటి వరకు కోట్లాది రూపాయల నిధులతో సిసి రోడ్లు, కల్వర్టులు, తాగునీరు కల్పన, ఆస్పత్రి అభివృద్ధి, ఇతర పనులు చేపట్టడం జరిగింది. మరింత అభివృద్ధికి కృషి చేస్తాం.

– కాతారి సురేష్‌కుమార్,
సర్పంచ్ రూడకోట గ్రామ పంచాయతీ.

సీపీఎం సభను విజయవంతం చేయండి



బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: జిల్లా కేంద్రం పాడేరులో ఈనెల 4న నిర్వహించనున్న సీపీఎం మహాసభను విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి కె.త్రినాథ్ కోరారు. మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ సత్యానారాయణతో పాటు నాయకులతో కలిసి శనివారం సీపీఎం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలే అజెండాగా సభ జరగనున్నట్టు తెలిపారు. మహాసభల్లో ఏజెన్సీలో జీవో నెంబర్-3ను అమలు, కాఫీ రైతులకు బకాయి చెల్లింపులు, పీవీటీజీలకు గృహాలకు రూ. 5లక్షలు మంజూరు, ప్రత్యేక డీఎస్సీ, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు తదితర డిమాండ్లతో పాటు ఆదివాసీ చట్టాలు, హక్కుల రక్షణ వంటి అంశాలను సభలో ప్రస్తావించనున్నట్టు పేర్కొన్నారు. సీపీఎం సభలకు గిరిజనులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేతలు లైకోన్, రాందాసు, గణపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

అరకులోయ టౌన్: గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రియాంక మృతికి కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని శనివారం జరిగిన కార్యకమంలో జిల్లా గిరిజన సంఘం మహిళా సంఘం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కౌసల్య, హైమావతి విలేకరులతో మాట్లాడుతూ అరకులోయ మండలంలోని ఎండపల్లివలస గురుకుల బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని జన్ని ప్రియాంక మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మృతురాలు విద్యార్థిని ప్రియాంక కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. మన్యంలో వరుసగా విద్యార్థుల మరణాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోందని, కనీసం చర్యలు తీసుకోవడం లేదని స్పష్టం చేశారు.

ఆలోచింపజేసిన ‘సంఘం శరణం గచ్ఛామి’



చింతపల్లి డిగ్రీ కళాశాలలో ప్రదర్శిస్తున్న నాటిక సన్నివేశం

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితకాల నాటక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ నాటక బృందం ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి పేరుతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ లక్ష్యాలను ప్రతి ఒక్కరికి చాటి చెప్పేలా నాటకాన్ని ప్రదర్శించారు. అంబేద్కర్ ఆశయాలను తెలియజేయాలనే ఉద్దేశ్యంతో నాటక ప్రదర్శనలు చేస్తున్నామని నాటక బృందం ప్రతినిధులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కాలేజీ ప్రిన్సిపాల్ విజయభారతి, అధ్యాపకులు తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు జగదీష్, లీలాపావని, సంతోషి, డాక్టర్ కెజియా, గ్రంథాలయ అధికారి టి.జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

కొయ్యూరు/గంగవరం/మారేడుమిల్లి: జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మొదలైంది. కొయ్యూరు, గంగవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీను ఎంపీడీవోలు ప్రసాద్, రామకృష్ణ, విశ్వనాథ్‌లు పర్యవేక్షించారు. సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారన్నారు. పలుచోట్ల పూర్తిగా పింఛన్ పంపిణీ జరగలేదు. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

అధ్వాన దారులతో అవస్థలు



జడ్డంగి వద్ద చిత్తడిగా మారిన జాతీయ రహదారి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి వద్ద నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారి శనివారం ఉదయం కురిసిన వర్షానికి చిత్తడిగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. జడ్డంగి శివార్లలో జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో భాగంగా రోడ్‌పై కొంతమేర గ్రావెల్ పరిచారు. కాగా తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఈ మట్టి కరిగి రహదారి చిత్తడిగా మారింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారి పనులు చేపడుతున్న సంస్థ స్పందించి క్వారీ బూడిద చల్లడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

రహదారిలో అగాధం.. రాకపోకలకు విఘాతం



గింజంగి- వనబలింగం మధ్య ఏర్పడిన గొయ్యి

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలం మొండిగెడ్డ పంచాయతీలోని గింజంగి, వనబలింగం గ్రామాల మధ్య రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో తిరిగే టిప్పర్లు, భారీ వాహనాల కారణంగా ఇక్కడ భారీ గొయ్యి ఏర్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. దీన్ని పూడ్చకుండా అలాగే వదిలేయడంతో గిరిజనులు భయం భయంగా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణానికి ఆందోళన చెందుతున్నామని వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని వారు కోరుతున్నారు.


ఆత్మీయ సన్మానం



డిఆర్‌వో సత్యనారాయణను సన్మానిస్తున్న అటవీశాఖ అధికారులు సిబ్బంది

చింతపల్లి: చింతపల్లి డివిజనల్ అటవీశాఖ కార్యాలయంలో లోతుగెడ్డ డిప్యూటీ రేంజ్ అధికారి వి.సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం సన్మాన కార్యక్రమాన్ని సిబ్బంది నిర్వహించారు. విధి నిర్వాహణలో సత్యనారాయణ అటవీ సంరక్షణకు ఎంతగానో శ్రమించారని, ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు.అధికారులు, సిబ్బంది దుశ్శాలువాతో సన్మానించారు. లోతుగెడ్డ రేంజ్ అధికారి ఎల్.కె.పాత్రుడు, సెక్షన్ అధికారులు సింహాచలం, వెంకట్రావ్, బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అదికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 20 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి నిందితులతో పోలీసులు

హుకుంపేట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా చంద్రిక పంచాయతీ అడారికూడ గ్రామానికి చెందిన పులకర అనే వ్యక్తి మండలంలోని ములియపుట్టు పంచాయతీ శాంతినగర్ కాలనీలో కూలి పనులు నిమిత్తం వచ్చి కొంత కాలం నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నారు. అయితే తమ స్వగ్రామం నుంచి గంజాయి తెచ్చి ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా మోహార్పుల్ గ్రామానికి చెందిన బాబుల్ సరియ అనే వ్యక్తికి శనివారం విక్రయించి రవాణాకు సిద్ధం చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించగా 18 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పులకర అనే వ్యక్తికి పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనలో గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన బాబుల్ సరియ అనే వ్యక్తి పరారు కాగా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు.

గంజాయితో ఐదుగురి అరెస్ట్

అల్లిపురం: చెన్నైకి గంజాయి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్న ఇద్దరు మహిళలు సహా ఐదుగురిని టూటౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20.028 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి ఈ కేసు వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తొండియార్‌పేట్, పూండితనగమ్మల్ స్ట్రీట్‌కు చెందిన షకీలా గుణ, పాలిని రాజేష్, నజీర్ భాషా, జబునిషాలు అల్లూరి సీతారామరాజు జిల్లా దిగురపల్లి మండలం బొంతిలికి చెందిన లాసంగి మల్లన్నను కలిశారు. అతని వద్ద నుంచి కిలో గంజాయి రూ.2,500 చొప్పున 20 కిలోల గంజాయిని రూ.50 వేలకు కొనుగోలు చేసేందుకు బేరం కుదుర్చుకున్నారు. రూ.30 వేలు అడ్వాన్స్ చెల్లించారు. మిగిలిన రూ.20 వేలు తర్వాత చెప్పి..10 కేజీల గంజాయి తీసుకుని విశాఖ చేరుకున్నారు. మిగిలిన 10 కిలోల గంజాయి తీసుకుని లాసంగి మల్లన్న శుక్రవారం విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నాడు. షకీలా గుణకు గంజాయిని అప్పగిస్తుండగా.. పోలీసులు దాడి చేసి గంజాయి స్వాధీనం చేసుకుని వివరాలు సేకరించారు. ఐదుగురిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తుపానుతో అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో యూ.శ్రీనివాసరావు, ఏవో బి.శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి, సాడిక, ఎర్రబొమ్మలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవోతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫంగల్ తుపానుతో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాతావరణ అధికారుల సూచనల మేరకు మరో 3,4 రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతాంగం వరి కోతలు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే వరి కోతలు చేపడితే వరి పనలను సురక్షిత ప్రాంతాల్లో కవర్లు కప్పి జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. వరి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు వెళ్లే విధంగా దారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షం కారణంగా వరి పనలు కుళ్లిపోకుండా, ధాన్యం రంగు మారకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని వరి పనలపైన, వరి కుప్పలపైన పిచికారీ చేయాలని సూచించారు.

‘చలో విజయవాడ’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

చింతపల్లి: ప్రభుత్వ ఉథద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని సాధించే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఏపిసిపిఎస్‌ఈఏ ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో చలో విజయవాడ పోస్టర్‌ను ఉద్యోగ సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ అమలుచేయాలనే డిమాండ్‌తో ఈనెల 10న విజయవాడలో చేపట్టనున్న ధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపిటిఎఫ్ మండల అధ్యక్షుడు కె.పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.మహేష్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కోటిబాబు, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం



అభిషేకాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ అనంతబాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి అటవీ ప్రాంతంలో కొండగుహలో గల స్వయం భూ భ్రమరాంభిక మల్లికార్జునస్వామి వారి ఆలయంలో శనివారం జరిగిన లక్షబిల్వార్చన పూజల్లో ఎమ్మెల్సీ ఉదయ్ భాస్కర్ (అనంతబాబు), రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. స్థానిక శివ మాలాధారులు ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం కలుగుతుందన్నారు. అనంతరం బిల్వార్చన పూజల్లో భక్తులతో కలిసి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌రాజు, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, పార్టీ కేడర్, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పాటుచేయొద్దు



గంగవరంలో వారపు సంతలో వ్యాపారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : మండల కేంద్రమైన గంగవరంలో వారపు సంత రోజున వ్యాపారులు దుకాణాలు రోడ్డుకు ఇరువైపులా పెట్టకుండా చర్యలు తీసుకున్నామని, వారికి సంత మార్కెట్ సముదాయాల్లో పెట్టుకోవాలని సూచించినట్టు ఎంపీడీవో పీజీ రామకృష్ణ తెలిపారు. శనివారం రోడ్డుకిరువైపులా దుకాణాలు పెడుతున్న వ్యాపారులు వారి దుకాణాలను సంత మార్కెట్ షెడ్లుల్లో పెట్టుకొనే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. గత వారం రంపచోడవరం సబ్ కలెక్టర్ వారపు సంతను పరిశీలించారు.రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా ట్రాఫిక్‌కు అంతరాయం, ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక తహసీల్దార్ ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు మార్కెట్‌లో షెడ్లను, పరిసరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణస్వామి, సచివాలయ సిబ్బంది శుభ్రం చేయించడంతో శనివారం వారపు సంతలో దుకాణాలను మార్కెట్ సముదాయంలో నిర్వహించారు.

గ్యాస్ లీకై పెంకుటిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న స్థానికులు



కాలిబూడిదైన సామగ్రి

- ప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి
- ఘటనలో రూ.10 లక్షల ఆస్తినష్టం
- సర్వం కోల్పోయిన బాధితులు

జి.మాడుగుల: మండలంలో కె.కోడాపల్లి పంచాయతీ కేంద్రంలో గల రెండు గిరిజన కుటుంబాలకు చెందిన పెంకుటిల్లు గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగి నగదు, బంగారం, దుస్తులు, ఇతర సామాగ్రి దగ్ధమయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం కె కోడాపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన సోమెలి భాస్కరరావు, సింహాచలంలకు చెందిన రెండు కుటుంబాలు కలిసి ఉంటున్న రెండు పోర్షన్ల పెంకుటిల్లులో వేర్వేరుగా నివసిస్తున్నారు. ఇందులో సోమెలి భాస్కరరావు కూతురు సోమెలి ఘనవి బర్త్‌డే కార్యక్రమం శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం ఉదయం అందరు బయటకు వెళ్లి మధ్యాహ్నం 3గంటల సమయానికి వచ్చే సరికి ఇంట్లో పొగలు వస్తుండటంతో కంగారు పడి తలుపులు తెరవగా గ్యాస్ బండ నుంచి గ్యాస్ లీక్ అవుతుండటం మంటలు చేలరేగడంతో భయంతో పరుగులు తీశారు. పాడేరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది మంటలు అర్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ అప్పటికే మంటల్లో సామగ్రి కాలి బూడిదైనట్టు స్థానికులు తెలిపారు. సోమెలి భాస్కరరావు ఇంట్లోని నగదు రూ.30,000, బంగారం, దుస్తులు, ఇతర సామగ్రి అంతా ప్రమాదంలో కాలి బూడిదైనట్టు బాధితుడు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన ఆస్తి నష్టం రూ.10లక్షలు ఉంటుందని బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

ఎడతెరిపివ్వని వర్షాలు.. ఆందోళనలో రైతులు

దుంబ్రిగుడ: బంగాళాఖాతంలో వాయుగుండం ఫెంగల్ తుఫాన్‌గా మారడంతో ఏజెన్సీ వ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షం కురిసింది. పొలాల్లో కోతలు చేసినా వరి పంట నీట పాలైంది. రెండు రోజుల్లో ధాన్యం పట్టించి ఇంటికి తీసుకెళ్లే తరుణంలో గిరిజన రైతుల ఆశలు అడియాసలయ్యాయి. ఏజెన్సీలో వర్షాలకు వరి, కూరగాయాలు, ఆకు కూరలు, వాణిజ్య పంటల నష్టపోయిన గిరిజన రైతులకు ప్రభుత్వం అన్ని విధా లుగా ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలరాజుతో పాటు పలువురు తదితరులు కోరుతున్నారు. వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పి రక్షణ చేపట్టారు.

కొయ్యూరు: తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి తేలికపాటి వర్షం కురిసింది. శనివారం ఉదయం కొద్దిసేపు వర్షం కురిసింది. రైతులు చాలా వరకు కుప్పలు వేసుకున్నారు. పండిపోయిన వరిని సకాలంలో కోయకపోయినా ధాన్యం వెన్ను నుంచి రాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యవసాయాధికారి ఉమాదేవి గ్రామాల్లో పర్యటించి, రైతులు వరి కోతలను రెండు రోజులపాటు వాయిదా వేయాలని సూచించారు.